సాక్షి
కామారెడ్డి
శనివారం । 3 । మే । 2025



అభివృద్ధి చేస్తా
నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పేర్కొన్నారు.
- 10లో ▸



తీరనున్న కష్టాలు
ఎల్లారెడ్డిలో నిర్మిస్తున్న బస్టాండ్ పనులు పూర్తి కావచ్చాయి. త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.
- 11లో ▸

గరిష్టం/కనిష్టం
44.1 /23.9

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని సొసైటీలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్క్‌ఫెడ్ రాష్ట్ర మేనేజర్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నీ బస్తాలను విడతల వారీగా పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఈవోపై చర్యలకు సిఫారసు

భిక్కనూరు: శ్రీసిద్ధరామేశ్వరాలయంలో హుండీ లెక్కింపులో చేతివాటం ప్రదర్శించిన ఎలక్ట్రీషియన్ లక్ష్మీనారాయణకు నామమాత్రపు నోటీసు ఇచ్చిన ఈవో శ్రీధర్‌పైనా చర్యలు తీసుకోవాలని ఆర్‌జేసీకి సిఫారసు చేసినట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామరావు తెలిపారు. ఆయన శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు. పేరు, లేఖ నంబర్ లేకుండా సంజాయిషీ నోటీస్ ఇవ్వడం, ఆ నోటిస్‌లో ఉన్నతాధికారులకు ప్రతులు పెట్టకపోవడం ఈవో నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దేవాలయాలను అప్రతిష్టపాలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. హుండీ లెక్కింపులో చేతివాటం ప్రదర్శించిన ఎలక్ట్రీషియన్‌పై శాఖాపరమైన చర్యలతో పాటు పోలీసు కేసు కూడా పెట్టాలని ఈవోను ఆదేశించామన్నారు.

7 వరకు విద్యుత్ భద్రత వారోత్సవాలు

కామారెడ్డి అర్బన్: జిల్లాలో ఈనెల 7వ తేదీ వరకు విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్ పొదుపు, రైతుల భద్రత, సులభంగా సేవలు పొందడం, టోల్‌ఫ్రీ నంబర్ -1912 పై వినియోగదారులను చైతన్యం చేయడం కోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

5 నుంచి జిల్లా స్థాయి వేసవి శిబిరం

కామారెడ్డి టౌన్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు టేక్రియాల్ కేజీబీవీలో విద్యార్థినులకు వేసవి శిబిరం నిర్వహించనున్నట్లు డీఈవో రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతం, నృత్యం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్ర లేఖనం, కంప్యూటర్ స్కిల్స్, ఆటలు, యోగా తదితర అంశాలలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు టేక్రియాల్‌లోని కేజీబీవీలో ఈనెల 5తేదీలోపు సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలో ర్యాంప్ పథకం అమలు కోసం మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయనున్నట్లు జిల్లా పరిశ్రమల అధికారి లాల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో గానీ, ఎంఎస్‌ఎంఈ వెబ్‌సైట్‌లోగాని సంప్రదించాలని సూచించారు.

విచారణ జరిపిస్తాం : రామారెడ్డి ఎంపీడీవో

సాక్షి ఎఫెక్ట్..

రామారెడ్డి: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో శవాలను పూడ్చే చోట ఉపాధి హామీ పనులు అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనంపై రామారెడ్డి ఎంపీడీవో తిరుపతిరెడ్డి స్పందించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పని కల్పించడానికి ఉపాధి హామీ మేట్ కూలీల వద్ద డబ్బులు డిమాండ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. దీనిపై విచారణ జరుపుతామన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు (ఫైల్)

సమ్మెకు సై!

ఉపాధి హామీ సిబ్బంది సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. పేస్కేల్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సర్కారు స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొంటున్నారు.

– నాగిరెడ్డిపేట

- ఆందోళన బాటలో ఉపాధి సిబ్బంది
- పేస్కేల్ అమలు.. పెండింగ్ వేతనాల విడుదల డిమాండ్లతో..
- కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు
- సర్కారు స్పందించకపోతే సమ్మెకు వెళ్తామంటున్న ఉద్యోగులు

ఉపాధి హామీ పథకంలో జిల్లావ్యాప్తంగా 14 మంది ఏపీవోలు, తొమ్మిది మంది ఈసీలు, 65 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, 328 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 40 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 22 మంది అటెండర్లు, ఎనిమిది మంది డీఆర్‌డీఏ కార్యాలయ సిబ్బంది పనిచేస్తున్నారు. టీఏలు మినహా ఇతర సిబ్బందికి మూడు, నాలుగు నెలలుగా వేతనాలు అందడంలేదు. నెలనెలా వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. వేతనాలు సకాలంలో రాకపోవడంతో నెలనెలా చెల్లించాల్సిన ఈఎంఐలు చెల్లించలేకపోతున్నామని, దీంతో ఫైన్‌లు పడుతున్నాయని, సిబిల్ స్కోర్ సైతం పతనమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో వేతనాలు అందేలా చూడాలని, పేస్కేల్ అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. లేకపోతే సమ్మెకు వెళ్లేందుకూ వెనకాడబోమని హెచ్చరిస్తున్నారు.

ఆందోళనలు..

ఉపాధి హామీ పథకం కింద విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన బాట పట్టారు. గత నెల 29న కలెక్టర్‌తోపాటు డీఆర్‌డీవోలకు వినతి పత్రాలు అందించిన ఉద్యోగులు.. 30వ తేదీ నుంచి పెన్‌డౌన్, షట్ డౌన్‌తో సహాయ నిరాకరణ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయాల వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. శనివారం మంత్రులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు ఇవ్వనున్నారు. ఆ తర్వాత కూడా ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళ్తామని పేర్కొంటున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఉపాధి హామీ సిబ్బందికి సకాలంలో వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలి. పేస్కేల్ అమలు చేయాలి. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి.

– కృష్ణాగౌడ్, ఉపాధిహామీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, కామారెడ్డి

ఇష్టంగా చదివా.. టాపర్‌గా నిలిచా

- ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం వరిస్తుంది
- మార్కుల కోసం అమ్మానాన్నలు ఒత్తిడి చేయలేదు
- 'సాక్షి'తో ఎస్సెస్సీలో అత్యుత్తమ మార్కులు సాధించిన అంచిత



తల్లిదండ్రులు, సోదరుడితో నిమ్మ అంచిత

కామారెడ్డి టౌన్: ''కష్టంగా కాకుండా ఇష్టంగా చదివా. ఎస్సెస్సీలో మంచి మార్కులు సాధించా'' అని ఎస్సెస్సీలో అత్యుత్తమ మార్కులు సాధించిన అంచిత 'సాక్షి'తో పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే తప్పక విజయం వరిస్తుందన్నారు. ఐఏఎస్ కావడమే లక్ష్యమని పేర్కొంది. ఎస్సెస్సీలో 596 మార్కులు సాధించిన జిల్లా కేంద్రానికి చెందిన అంచితను శుక్రవారం 'సాక్షి' ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు..

రోజూ ఉదయం 5 గంటలకే నిద్ర లేచేదాన్ని. గంటన్నరపాటు చదివా. స్కూల్లో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విన్నా. కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని, ఏమైనా డౌట్ ఉంటే వెంటనే టీచర్స్‌ను అడిగి నివృత్తి చేసుకునేది. సాయంత్రం ఇంటికి వచ్చాక రోజంతా చెప్పిన క్లాసులను రివైజ్ చేసుకున్నాను. అన్ని పాఠ్యాంశాలలో ఏ ఒక్క ప్రశ్నను వదలకుండా ప్రాక్టీస్ చేశాను. లాంగ్వేజ్ సబ్జెక్టులు స్కోరింగ్ కోసం ఉపయోగపడ్డాయి.

ఐఏఎస్ కావడమే లక్ష్యం

ఇంటర్‌లో ఎంపీసీ తీసుకుంటా. ఇప్పటినుంచే జేఈఈకి సన్నద్ధమవుతున్నా. ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం. తప్పకుండా ఐఏఎస్ సాధిస్తానన్న నమ్మకం నాకుంది.

సెల్‌ఫోన్‌కు బానిసకావొద్దు..

విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై శ్రద్ధ వహించాలి. పాఠాలను అర్థం చేసుకోవాలి. సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు బానిస కావొద్దు. ఇంటర్నెట్‌ను చదువుల్లో మన సందేహాలను నివృత్తి చేసుకోవడానికి వినియోగించుకోవాలి.

ఒత్తిడి లేదు..

నాన్న శశిధర్‌రెడ్డి కాంట్రాక్టర్. అమ్మ కీర్తన గృహిణి. స్కూల్‌లో ఉపాధ్యాయులు గానీ, ఇంటి వద్ద అమ్మనాన్న గానీ ఏ రోజు కూడా బాగా చదువు.. మార్కులు బాగా తెచ్చుకో అంటూ ఒత్తిడి చేయలేదు. దీంతో ప్రశాంతంగా చదవగలిగా. ప్రధానంగా పరీక్షలంటే భయపడలేదు. దీంతో పరీక్షలు బాగా రాసి, ఉత్తమ మార్కులు సాధించగలిగాను.

'వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు'



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్: పీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బంది వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ హాల్‌లో పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య కార్యక్రమాల లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. పీహెచ్‌సీలలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. గ్రామాలలో డయాబెటిక్, బీపీ, టీబీ, క్షయ, హెచ్‌ఐవీ తదితర వ్యాధులకు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు స్క్రీనింగ్ వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వాలన్నారు.

ఎప్‌సెట్ రాసి తిరిగి వెళ్తూ అనంతలోకాలకు..

- నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం
- ఇద్దరు నిర్మల్ జిల్లావాసులు మృతి



అశ్విని (ఫైల్)



మంజుల (ఫైల్)

జక్రాన్‌పల్లి: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్లు అక్కడికక్కడే మృతి చెందారు. జక్రాన్‌పల్లి ఎస్సై ఎండీ మాలిక్ రహమాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని లోత్‌ర్య తండాకు చెందిన బానవత్ మంజుల(19), బానవత్ అశ్విని(17) శుక్రవారం ఎప్‌సెట్ రాసేందుకు కారులో హైదరాబాద్ వెళ్లారు. పరీక్ష రాసి తిరిగి వస్తుండగా.. అర్గుల్ శివారులోని జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న అక్కాచెల్లెళ్లు మంజుల, బానవత్ అశ్విని అక్కడికక్కడే మృతి చెందారు. కారును నడుపుతున్న జాదవ్ హంసరాజుకు కాలు, చేయి విరిగాయి. అతడిని ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ, పాల్గొన్న ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు

- రాష్ట్ర కులగణన దేశానికి ఆదర్శం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- కామారెడ్డిలో జిల్లా కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

కామారెడ్డి టౌన్: ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కుల గణన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్ర కులగణన సర్వేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏడాదిన్నరలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని బీఆర్‌ఎస్, బీజేపీలు చూసి ఓర్వలేకపోతున్నాయన్నారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసిన బీఆర్‌ఎస్‌కు, తెలంగాణకు నయా పైసా ఇవ్వని బీజేపీకి మాట్లాడే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్త, నాయకుల రుణం తీర్చుకుంటామన్నారు. ఏఐసీసీ ఆదేశాలు మేరకు గ్రామ, మండల, బ్లాక్ కమిటీల ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని స్థానాలలో గెలవడానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, ఆగ్రో పరిశ్రమల రాష్ట్ర చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీలు సత్యనారాయణ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, నాయకులు పండ్ల రాజు, రాజిరెడ్డి, జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకో మండలంలో రెవెన్యూ సదస్సులు

- 5 నుంచి 20 వరకు..
- వీసీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం



మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: పైలట్ ప్రాజెక్టు జిల్లాలను మినహాయించి మే 5 నుంచి 20 వరకు జిల్లాకు ఒక మండలం చొప్పున అన్ని జిల్లాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణారావు, సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. జూన్ 2 వరకల్లా పైలట్ ప్రాజెక్ట్ కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా జరిగే రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 15 లక్షల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ భూములలో పొజిషన్ కలిగిన రైతుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. భూమి లేని నిరుపేదలు పొజిషన్‌లో ఉంటే వారికి పట్టాలు ఇవ్వడానికి సీఎంతో మాట్లాడి సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. హైకోర్టు నుంచి అనుమతి రాగానే సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలన్నారు.

అసైన్డ్ భూములను విక్రయిస్తే..

గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములను ఎవరైనా విక్రయిస్తే ముందుగా ఆ పట్టాలను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అలాంటి భూములను కొనుగోలు చేసిన వారు ఒకవేళ భూమి లేని నిరుపేదలైతే ఎంత భూమిని క్రమబద్ధీకరించాలి అనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అటవీ భూముల వివాదాల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. మే 4న జరిగే నీట్ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అర్బన్ పీఎం ఆవాస్ యోజన కింద లక్షా 13 వేల ఇండ్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. 600 చదరపు గజాలకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే కేంద్ర ప్రభుత్వం నిధులు రావన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హౌజింగ్ శాఖ కోసం ప్రత్యేకంగా ప్రతి మండలానికి ఏఈలను కేటాయిస్తామన్నారు.

4,225 దరఖాస్తులు..

భూ భారతిలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన లింగంపేట్ మండలంలో 4,225 దరఖాస్తులు వచ్చాయని కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దిష్ట గడువులోగా ఆయా దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, హౌజింగ్ పీడీ జైపాల్‌రెడ్డి, భూ భారతి ప్రత్యేకాధికారి రాజేందర్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, లింగంపేట తహసీల్దార్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు అప్‌డేట్ చేయాలి



సుభాష్‌నగర్ : నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సాంకేతిక కారణాలతో రుణ మాఫీ కాని రైతుల వివరాలు, మిస్సింగ్ డేటాను రుణమాఫీ పోర్టల్‌లో అప్‌డేట్ అయ్యేలా చూడాలని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి కోరారు. రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం రమేశ్ రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లాల్లోని సొసైటీల్లో సీబీలో నమోదు చేయని కారణంగా రుణమాఫీ వర్తించలేదని, ఆ రైతుల వివరాలను పోర్టల్‌లో అప్‌డేట్ చేసి రుణాలు మాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ కోదండరెడ్డి విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా రుణమాఫీ అమలయ్యేలా చూస్తామని హామీనిచ్చారన్నారు. అంతకుముందు కోదండరెడ్డిని శాలువాతో సత్కరించారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు, టీజీసీఏబీ ఎండీ కృష్ణారావు పాల్గొన్నారు.

కార్యదర్శులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



కార్యదర్శులకు సూచనలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జీపీ కార్యదర్శులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని విధులకు సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లాలోని పలువురు పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సలహాలు, సూచనలు అందజేశారు. అలాగే పంచాయతీ రాజ్ చట్టం, గ్రామ పంచాయతీ స్థాయిలో పారదర్శకతను పెంపొందించడం, సమాచార హక్కు చట్టం -2005, పంచాయతీ కార్యదర్శి పాత్ర, గ్రామసభ, సమాచార హక్కులాంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

కామారెడ్డి క్రైం: ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. అత్యవసరం అయితే తప్ప బయటికి వెళ్లకూడదని పేర్కొన్నారు. జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలను వివరిస్తూ ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే కరపత్రాల రూపంలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కళాకారుల ద్వారా గ్రామాల్లో పాటల రూపంలో ప్రచార కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వేసవిలో డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశాలుంటాయని, దీని నివారణకు ప్రజలు ఎక్కువగా ద్రవ పదార్థాలు, పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు. వడ దెబ్బ లక్షణాలు కనిపించిన వ్యక్తులను వెంటనే ఆస్పత్రులకు తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. వడదెబ్బకు గురైనవారికి వెంటనే వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

'డబుల్' బిల్లుల కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సోమార్‌పేట్‌వాసులు

ఎల్లారెడ్డి: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం సోమార్‌పేట్ గ్రామస్తులు ఎల్లారెడ్డిలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమార్‌పేట్ గ్రామానికి చెందిన పది మందికి 2023లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇళ్లు నిర్మించుకుని ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా బిల్లు చెల్లించలేదన్నారు. ఎమ్మెల్యే సూచనతో అధికారులు రెండు నెలల క్రితమే ఇళ్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినా ఇప్పటివరకు బిల్లులు మంజూరు చేయలేదన్నారు. బిల్లుల కోసం తలా కొంత జమ చేసి డీఈఈ గిరిధర్‌కు లక్షన్నర రూపాయలు అందించామన్నారు. అధికారులు మరిన్ని డబ్బులు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు. బిల్లుల ఈ విషయమై డీఈఈ గిరిధర్‌ను వివరణ కోరగా సోమార్‌పేట్ గ్రామస్తులకు సంబంధించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాలు 15 రోజుల క్రితమే ఆన్‌లైన్‌లో నమోదయ్యాయన్నారు. లబ్ధిదారులు ఇంతవరకు వారి ఇళ్లకు సంబంధించిన అగ్రిమెంట్ కాపీలను అందించలేదన్నారు. తనకు ఎవరూ డబ్బులు ఇవ్వలేదని, అనవసరంగా తనపై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి డబ్బులు రాగానే కాంట్రాక్టర్ ద్వారా లబ్ధిదారులకు అందిస్తామన్నారు.

క్లుప్తంగా

రైతన్న ఐడియా అదుర్స్



జనగామ మర్రి వద్ద వడ్లను ద్విచక్ర వాహనంతో ఆరబోస్తున్న తండ్రీకొడుకులు

బీబీపేట: మండలంలోని జనగామ మర్రి వద్ద ప్రధాన రహదారిపై తండ్రీకొడుకులు తమ సొంత ఆలోచనలతో ఆరబోసిన వడ్లను వాహనం సహాయంతో ఎండబెట్టారు. నేర్పారు. కల్లాలు లేకపోవడంతో రోడ్లపైనే ఆర బోసిన ధాన్యాన్ని ద్విచక్ర వాహనానికి వెను కాల ఒక చెక్కతో ఏర్పాటు చేసి తాడు సహ యంతో వాహనాన్ని నడుపుతూ ధాన్యం ఆర బెట్టుతుండగా ఈ దృశ్యాన్ని శుక్రవారం 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్ శివారులో ఉన్న మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఆర్‌ఐ సాయిబాబా తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి నట్లు పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను మద్నూర్ పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బోధన్ నుంచి హైదరాబాద్‌కు కొత్త బస్సు సర్వీసు

రుద్రూర్: ఎండకాలం ప్రయాణికుల సౌకర్యార్థం బోధన్ బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు రుద్రూర్, వర్ని, బాన్సువాడ, మెదక్ మీదుగా కొత్తగా హైటెక్ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. బోధన్ బస్టాండ్ నుంచి రాత్రి పది గంటలకు బస్సు బయలు దేరుతుందని అన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రయాణికులు రాత్రి వేళ ప్రయాణం చేయడానికి ఆసక్తి చూపుతున్నారని డిపో సిబ్బంది సీనియర్ కంట్రోలర్ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో వెల్లడైంద న్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి హైటెక్ సర్వీస్‌ను ప్రారంభించామని అన్నారు.

'దోస్త్' నోటిఫికేషన్ విడుదల

- మూడు విడతల్లో డిగ్రీ ప్రవేశాలు
- తెయూ పరిధిలో 33,830 సీట్లు

తెయూ(డిచ్‌పల్లి): డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి శుక్రవారం 'దోస్త్' (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) 2025–26 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మూడు విడతల్లో డిగ్రీ ప్రవేశాలకు అవకాశం కల్పించింది. ఈ సారి దోస్త్ ప్రక్రియను రద్దు చేసి ఇంటర్ మార్కుల ఆధారంగా డిగ్రీలో ప్రవేశాలు కల్పించాలని మొదట ఉన్నత విద్యామండలి అధికారులు భావించారు.

అయితే చివరకు ఆలస్యంగా శుక్రవారం దోస్త్ నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి విడుదల చేశారు. గతేడాది మాదిరిగానే ఈ సారి విద్యార్థికి ఇష్టమైన సబ్జెక్టును ఎంచుకునేందుకు వీలు కల్పించే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. గతేడాది సున్నా అడ్మిషన్లు జరిగిన 82 కళాశాలలకు ఈ సారి అనుబంధ గుర్తింపు ఇవ్వకూడదని అధికారులు నిర్ణయించారు. కొత్త కోర్సులు ప్రారంభించాలనుకునే కాలేజీల సీట్లకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.

డిగ్రీలో విద్యాప్రమాణాల పెంపు, సిలబస్ మార్పుపై నాలుగు నెలలుగా మండలి తీవ్రంగా కృషి చేస్తోంది. వర్సిటీల వీసీలు, విద్యారంగ నిపుణులతో సిలబస్ మార్పుపై మండలి చైర్మన్ చర్చలు జరిపారు. ఈ ఏడాది నుంచే కొత్త సిలబస్ అమలులోకి తెస్తామని తెలిపారు. అయితే దీనికి విద్యాశాఖ ఇంతవరకూ ఆమోదం తెలుపకపోవడంతో సిలబస్ మార్పుపై సందేహాలు నెలకొన్నాయి.

రాష్ట్రంలోని ఏ విశ్వవిద్యాలయంలోనైనా ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, జేఎన్‌టీయూ, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మరియు శిక్షణ మండలి(టీఎస్‌బీటీఈటీ) డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దోస్త్ సింగిల్ విండో ద్వారా సేవలను అందిస్తోంది. విద్యార్థులు ఎవరి సహాయం లేకుండా స్వయంగా తమ డిగ్రీ అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్‌లో పేర్కొంది. దోస్త్ వెబ్‌సైట్ https:// dost. cgg. gov. in ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.



దోస్త్ వెబ్‌సైట్

- మొదటి విడత: మే 3 నుంచి 21వరకు మొదటి విడతగా దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. మే 10నుంచి 22వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మే 29న మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది.
- రెండవ విడత: మే 30 నుంచి జూన్ 8వరకు దరఖాస్తుల స్వీకరణ. మే 30 నుంచి జూన్ 9వరకు వె బ్ ఆప్షన్లు. జూన్ 13న సీట్ల కేటాయింపు ఉంటుంది.
- మూడవ విడత: జూన్ 13 నుంచి 19వరకు దరఖాస్తుల స్వీకరణ. జూన్ 13 నుంచి 19వరకు వెబ్ ఆప్షన్లు. జూన్ 23న సీట్ల కేటాయింపు ఉంటుంది. జూన్ 30 నుంచి డిగ్రీ కళాశాలల్లో తరగతులు ప్రారంభం.

తెయూ పరిధిలో 69 కళాశాలలు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ (ప్రభుత్వ 15, ప్రభుత్వ అటానమస్ 5, ప్రైవేటు 49) కళాశాలలు మొత్తం 69 ఉన్నాయి. ఈ కళాశాలల్లో మొత్తం 33,830 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే గతేడాది కేవలం 12,764 సీట్లు(37.73 శాతం) మాత్రమే భర్తీ అయ్యాయి. ఈ సారి కూడా 40 శాతం లోపే సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని చిట్యాల గ్రామంలో రూ.2.11 కోట్లతో 33–11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈసబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయినట్లయితే మండలంలోని చిట్యాల, సంతాయిపేట్, సోమరం, సోమారం తండాతో పాటు అన్నారం గ్రామానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయవచ్చన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని దీంతో 22వ ప్యాకేజీ కింద రూ.23కోట్ల నిధులను మంజూరు చేయించాన్నారు. అన్ని గ్రామాలలో రూ. 25కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలను నిర్మించమన్నారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చిట్యాల– సంతాయిపేట్ రూట్లతో ఆర్టీసీ బస్సు ట్రిప్పులను పెంచేలా కృషిచేస్తానన్నారు. ఎరువులను నిల్వ చేసేందుకు చిట్యాలలో గోదాంను మంజూర్ చేయిస్తానన్నారు.అంతకు ముందు మండల కేంద్రం నుంచి చిట్యాల వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్‌ఈ శ్రావణ్, డీఈలు కల్యాణ్ చక్రవర్తి, నాగరాజు, ఏడీఈ కిరణ్ చైతన్య, ఏఈ కరుణాకర్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు శివాజీ, మహేందర్‌రెడ్డి, లక్ష్మణచారీ, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేవీఆర్

రాజంపేట: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి అన్నారు. శుక్రవారం శివాయిపల్లి గ్రామంలోని వినాయక యూత్ అసోసియేషన్, మాల సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి మరువలేనిదని, ప్రపంచ దేశాలకు అంబేడ్కర్ మార్గదర్శిగా నిలిచాడని కొనియాడారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు బక్కి నవీన్, బక్కి ప్రశాంత్, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు కంకణాల రమేష్, వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు కంకణాల బాల్‌నర్స్, మెపాల్, కంకణాల రవీందర్, ప్రభాకర్, సిద్ధ రాములు, రమేష్, ఉదయ్, మాజీ ఉపసర్పంచ్ సంధ్య బాలరాజ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ రవికుమార్



వివరాలు తెలియజేస్తున్న రవికుమార్

డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ) నూతన డైరెక్టర్‌గా ఎం రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సంస్థ డైరక్టర్‌గా పని చేసిన సుంకం శ్రీనివాస్ ఏప్రిల్ 30న పదవీ విమరణ పొందారు. ఆయన స్థానంలో ఎస్‌బీఐ ఉన్నతాధికారులు రవికుమార్‌ను నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. ఎలక్ట్రీషియన్(30రోజులు), సీసీటీవీ ఇన్‌స్టాలేషన్(13 రోజులు) ఫొటో అండ్ వీడియోగ్రఫీ (30 రోజులు) కోర్సులలో పురుషులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 3 నుంచి 20వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 ఏళ్ల లోపు వయసు కలిగిన యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసువాలని కోరారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డిచ్‌పల్లిలో ఉన్న ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో సందర్శించాలని, 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వాహనాల తనిఖీ : పలువురికి జరిమానాలు



లింగంపేట/సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు చౌరస్తాలో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలపై పెండింగ్ ఉన్న చాలన్‌లను చెల్లించాలని సూచించారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధించారు. కార్లలో ప్రయాణం చేసేవారు సీట్ బెల్టు ధరించాలని సూచించారు. ధ్రువపత్రాలు, హెల్మెంట్ ధరించని 10 మందికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. అలాగే సదాశివనగర్ మండలం పద్మాజీవాడి, మోడెగాం గ్రామాల చౌరస్తాల వద్ద ఎస్సై రంజిత్ వాహనాల తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్‌ఐ రాఘవేందర్, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులను చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధిహామీ పథకంలో కొలతల ప్రకారం పనిచేసినట్లయితే పనికి తగ్గ వేతనం వస్తుందని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. మండలంలోని చిట్యా ల గ్రామ శివారులో నడుస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం సంతాయిపేట్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ, ఎంపీవో సవితారెడ్డి, తదితరులున్నారు.

ఇంటర్‌లో తెలుగును తప్పనిసరి చేయాలి



మాట్లాడుతున్న శంకర్

కామారెడ్డి అర్బన్: కవులు, రచయితలు మనుషులను మానవీయం చేయడానికి కృషి చేయాలని తెలంగాణ రచయితల సంఘం (తెరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శంకర్ అన్నారు. తెరసం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విజన్ కళాశాలలో కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు రుద్రంగి రమేష్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా శంకర్ హాజరయ్యారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించి మృతులకు సంతాపం ప్రకటించి మౌనంతో శ్రద్ధాంజలి ఘటించారు. ఇంటర్‌లో తెలుగును తప్పని సరిచేయాలని తీర్మాణించారు. అనంతరం శంకర్ మాట్లాడుతు.. తెరసం తెలంగాణ అస్తిత్వ చైతన్యంతో పనిచేస్తుందని, కొత్త తరం రచయితలను ప్రోత్సాహించాలన్నారు. బాన్సువాడకు చెందిన కవి నారాయణభట్టుపై మరిన్ని రచనలు రావాలన్నారు. సమవేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుప్పని సత్యనారాయణ, ప్రతినిధులు పి.కైలాస్, వడ్ల రమేష్, శ్రీనివాస్, వెంకన్న, ఓరం సంతోష్, మారుతి, అశోక్‌కుమార్, సిహెచ్ ప్రకాష్, సిరిగాద శంకర్, పూర్ణచందర్‌రావు, తగిరంచ నరసింహారెడ్డి, బి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ నిర్మించక ఇబ్బందులు

- గజ్యా నాయక్ తండా చౌరస్తాలో గ్రామస్తుల ఆవేదన
- సమస్య పరిష్కరించాలని వినతి



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో నాలుగు లైన్ల రోడ్డు నిర్మించినప్పుడు రోడ్డుకిరువైపుల డ్రెయినేజీ నిర్మించకపోవడంతో మురుగు వీధుల్లో చేరి కంపుకొడుతోంది. ఎన్ని సార్లు అధికారులకు మొర పెట్టుకున్నా లాభం లేకుండా పోతోందని గ్రామస్తులు వాపోతున్నారు. దోమలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మించాలని కోరుతున్నారు.ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రిజ్వానా బేగంను సంప్రదించగా ప్రస్తుతం గ్రామ పంచాయతీలో నిధులు లేవని, నిధులు మంజూరైన తర్వాత డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపడతామన్నారు.

దోమల బెడద ఎక్కువైంది

డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు నిల్వ ఉంటుంది. దీంతో దోమలతో రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మించాలి.

– స్వామిగౌడ్, స్థానికుడు

కంపు కొడుతోంది

తాత్కాలిక డ్రెయినేజీ నిర్మాణం కోసం కాలువ తీయడంతో మురికి నీరు చేరి కంపు కొడుతోంది.దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు స్పందించాలి.

– సాయికిరణ్, స్థానికుడు

రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి



పెద్దమల్లారెడ్డి కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న మానిటరింగ్ అధికారి సురేష్

భిక్కనూరు: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల మానిటరింగ్ అధికారి సురేందర్ సూచించారు. శుక్రవారం ఆయన పెద్దమల్లారెడ్డి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. కాంటాలు జరిగిన వెంటనే రైసుమిల్లులకు ధాన్యంను పంపించి ట్యాబ్ ఎంట్రీ వెంటవెంటనే చేయాలన్నారు. సీఈవో మోహన్‌గౌడ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వలో కొనుగోలు కేంద్రం వద్ద సన్నరకాల ధాన్యాన్ని శుక్రవారం మండల వ్యవసాయశాఖ అధికారిణి నవ్య పరిశీలించారు. యంత్రం ద్వారా సన్నరకాల వరిధాన్యానికి కొలతలు తీశారు. నిబంధనల ప్రకారంగా ధాన్యాన్ని ఆరబెట్టి, తాలులేకుండా, నూకశాతం తగ్గకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ ఏఈవో మధుసూదన్, సెంటర్ ఇన్‌చార్జీలు రాజేందర్, రాజు, రైతులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 5 నుంచి 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని అన్నారు.

క్రైం కార్నర్

బోరు మోటార్ల కేబుల్ వైర్లు చోరీ



ఆలూర్‌లో కేబుల్‌వైర్లు కత్తిరించిన దృశ్యం

అర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రాల్లో రైతుల వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన కేబుల్ వైర్లు, ఫీజులు, స్టార్టర్లను గుర్తు తెలియని దొంగలు గురువారం రాత్రి దొంగిలించినట్లు రైతులు తెలిపారు. క్లోం మోహన్, బార్ల మనోజ్, కేశపల్లి గంగారెడ్డి, గాదపెల్లి గంగారెడ్డి, మోటార్ చిన్నమల్లయ్య, బాదగుణ ముత్యం, మంథని నితిన్, బార్ల మనీష్, పిప్పర మోహన్, అకిడి సత్యం, గాదపెల్లి సాయిరెడ్డి, హరీశ్ మిద్దెల, సుమన్‌లకు చెందిన వ్యవసాయ బోరుబావుల నుంచి కేబుల్ వైర్లను, స్టార్టర్లను, ఫీజులను దుండగులు ఎత్తుకెళ్లినట్లు రైతులు వాపోయారు. తరచూ దుండగులు బోరుబావుల వద్ద నుంచి స్టార్టర్ డబ్బాలోని వస్తువులతో పాటు, కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లడంతో తమకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు దృష్టిసారించి దుండగులను పట్టుకొని సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు..

బోధన్‌రూరల్: బోధన్ పట్టణం ఆచన్‌పల్లి ప్రాంతంలోని రైతుల పొలాల్లో శుక్రవారం మూడు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్లు బోధన్ ట్రాన్స్‌కో టౌన్–1 ఏఈ కృష్ణ తెలిపారు. చోరీపై రైతుల సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు తమ పొలాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

హోటల్ యజమానికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: నగరంలోని మాలపల్లికి చెందిన అబ్దుల్ ఆసిఫ్‌కు స్పెషల్ సెకండ్ క్లాస్ జడ్జి నూర్జహన్ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. నగరంలోని మాలపల్లిలో రాత్రి వ్యాపార సమయం దాటిన తర్వాత దోశ సెంటర్ నడిపించిన అబ్దుల్ ఆసిఫ్‌ను జడ్జి ఎదుట ముందు హాజరుపర్చగా జడ్జి ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో ఒకరికి రెండు రోజులు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పీఎస్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ శుక్రవారం తెలిపారు. ఆర్మూర్‌కు చెందిన అక్షయ్‌కు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడడంతో పీఎస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. జడ్జి అతనికి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

టైరు పేలి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



కామారెడ్డి క్రైం: దేవునిపల్లి శివారులో ఉన్న దేవి విహార్ వద్ద ఎల్లారెడ్డి–కామారెడ్డి ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం ఓ కారు ప్రమాదానికి గురైంది. టైరు పేలడంతో రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీ కొన్నది. కారు రోడ్డు కిందకు చెట్ల పొదల్లోకి దూసుకుపోగా విద్యుత్ స్తంభం విరిగిపోయింది. తాడ్వాయిలో ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న శివతేజ కారు నడిపిస్తున్నారు. ప్రమాదంలో అతడికి గాయాలు కాగా స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం సంభవించినప్పుడు సమీపం నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మహిళ మృతదేహం స్వాధీనం

మోపాల్: మండలంలోని కాల్పోల్ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ (50) మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తునికాకు సేకరణ కోసం అటవీ ప్రాంతానికి వచ్చిన మహిళ వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జైలు శిక్షా, ఏడుగురికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి నగరంలోని ట్రాఫిక్ పీఎస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చగా ఒకరికి జైలు, ఏడుగురికి రూ.12 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

గుండారం మాజీ ఎంపీటీసీకి రిమాండ్

రాజంపేట: మండలంలోని గుండారం మాజీ ఎంపీటీసీ హజీ నాయక్‌ను శుక్రవారం రిమాండ్‌కు తరిలించినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. గత నెల నడిమి తండాకు చెందినన హజీనాయక్ గ్రామంలోని గొడవలను సృష్టించడం, తండాలో జరిగే గొడవలపై కేసులు పెట్టిన వారిపై దాడి చేసినందుకుగాను బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. కోర్టు అనుమతి మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రుద్రూర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

రుద్రూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సిద్ధిరాం చిన్నయ్యను సస్పెండ్ చేస్తూ శుక్రవారం జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం తెంబుర్తి గ్రామానికి చెందిన రావుల నాగభూషణం అనే వ్యక్తికి ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానని కానిస్టేబుల్ చిన్నయ్య రూ. రెండు లక్షలు తీసుకుని ఇప్పటి వరకు ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో బాధితుడు వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ చిన్నయ్యపై కేసు నమోదైంది. నిర్మల్, ఖానాపూర్ ప్రాంతాల్లో పలువురి వద్ద ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇతరులకు అప్పులు ఇచ్చి అధిక వడ్డీ వసూలు చేసినట్లు ఆరోపణలు రావడంతో క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

నిందితుడికి ఆరునెలలు..

ఖలీల్‌వాడి: బైక్ ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జూనియర్ సివిల్ జడ్జి వడ్డి హరికుమార్ ఆరు నెలల జైలు శిక్షను విధించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం మాణిక్‌బండార్ తండాకు చెందిన మాలోత్ ప్రకాశ్‌ను కల్లెడి గ్రామానికి చెందిన దూదేకుల అర్బాస్ నిర్లక్ష్యపు బైక్ డ్రైవింగ్‌తో మాక్లూర్ పరిధిలో ఢీకొన్నాడు. ఈ ఘటనలో ప్రకాశ్‌కు తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు అర్బాస్‌పై పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నిందితుడు అర్బాస్ నేరం చేసినట్లు రుజువు కావడంతో జడ్జి అతనికి ఆరు నెలల జైలు శిక్షను విధించినట్లు తెలిపారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

నిజామాబాద్‌అర్బన్: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రణాళికను రూపొందించి ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఇంటర్ బోర్డు ప్రత్యేక అధికారి ఒడ్డెన్న అన్నారు. ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒడ్డెన్నను జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఒడ్డెన్న మాట్లాడుతూ.. ఇంటర్ ఫెయిల్ అయిన ప్రతి విద్యార్థి పాస్ కావడానికి అవసరమైన విషయ పరిజ్ఞానాన్ని బోధించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యక్ష లేదా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణపై సమీక్ష నిర్వహించి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు కళాశాలకు హాజరై ఫెయిల్ అయిన విద్యార్థుల జాబితా సేకరించి వారం దరూ తరగతులకు హాజరయ్యేలా ప్రిన్సిపాల్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పదో తరగతి పాసైన విద్యార్థుల జాబితాను సేకరించి ప్రత్యక్షంగా విద్యార్థులను కలుస్తూ వారిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించేందుకు ప్రణాళికను రూపొందించాలని అన్నారు.

బాకీ డబ్బులు అడిగినందుకే హత్య

- నర్సన్నపల్లి మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి శివారులో వద్ద రెండు రోజుల క్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసును 48 గంటల వ్యవధిలోనే పోలీసులు ఛేదించారు. గతంలో అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినందుకే నిందితుడు ఆమెను హత్య చేసినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. హత్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర వివరాలు వెల్లడించారు. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన కవిత(44) బుధవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త గంగారెడ్డి, కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని కనిపించింది. మృతురాలు ఒంటిపై ఆభరణాలు లేకపోవడంతో దుండగులు ఆమెను హత్య చేసి ఉంటారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆధారాలతో నిందితుడిని పాత నేరస్తుడు జంగంపల్లి మహేశ్‌గా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. ఏడాది క్రితం నిందితుడు భిక్కనూర్ పీఎస్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు. ఆ కేసులో జైలులో ఉన్న అతడికి బెయిల్ మంజూరు చేయించడానికి గాను అతడి కుటుంబ సభ్యులు ఈ కేసులో మృతురాలైన చిదుర కవిత వద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నారు. మహేశ్ నెల రోజుల క్రితం బెయిల్ పై బయటకు వచ్చాడు. తన వద్ద తీసుకున్న రూ.లక్ష తిరిగి ఇవ్వాలని కవిత పలుమార్లు మహేశ్‌ను అడగడంతో ఆమెను చంపేస్తే డబ్బులు ఇవ్వాల్సిన అవసరం ఉండదని భావించిన అతను పథకం ప్రకారం బుధవారం సాయంత్రం వ్యవసాయ క్షేత్రం దగ్గరకు వస్తే డబ్బులు ఇచ్చేస్తానని చెప్పి నమ్మించాడు. ఒంటరిగా ఉన్న కవితపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఆపై చీరతో మెడకు ఉరి బిగించి హత్య చేసి మృతురాలి ఒంటిపై ఉన్న ఆభరణాలు ఎత్తుకెళ్లాడని ఎస్పీ వివరించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. 48 గంటల్లోనే కేసును ఛేదించడంలో విశేషంగా కృషి చేసిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.